క్లుప్తంగా

ముగిసిన క్రీడా శిక్షణ



వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలంలోని ఉప్పలపాడు గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల విద్యాలయంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న బాలికల క్రీడా శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. మండల స్కూల్ గేమ్స్ పోటీల్లో ఎంపికై న విద్యార్థులకు నియోజకవర్గం, జిల్లాస్థాయి క్రీడల్లో రాణించేందుకు ఖోఖో, కబడ్డీ క్రీడల్లో శిక్షణ ఇచ్చారు. మొత్తం 50మంది విద్యార్థినులకు పాఠశాలలో వసతి కల్పించి శిక్షణ ఇచ్చినట్లు ప్రిన్సిపాల్ ఎస్.వి.రమణమ్మ తెలిపారు. స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ ఎస్.వెంకటరత్నం, పీడీ జోత్స్న, రమణబాబు, విజయ్, రేణుక, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థినికి సాయం



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ శాంతి ఆశ్రమం ట్రస్ట్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల గ్రామానికి చెందిన ఎంబీబీఎస్ విద్యార్థిని కనుగుల పూజితకు హిమాలయ గురూజీ చేతుల మీదుగా రూ.25వేలు అందజేశారు. పట్టణానికి చెందిన ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి కన్నెగండ్ల అనంత కోటేశ్వరరావు, సువర్చలదేవి దంపతులు రూ.25వేలు సాయాన్ని హిమాలయ గురూజీ చేతుల మీదుగా అందజేశారు. పూజితకు ఐదేళ్ల పాటు నెలకు రూ.7వేలు ట్రస్ట్ ద్వారా అందజేస్తామని వివరించారు. విద్యకోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి ట్రస్ట్ ద్వారా సహాయ సహకారాలు అందజేస్తామని సభ్యులు తెలిపారు.

వాసవీ క్లబ్ రీజియన్ మహోత్సవం



వినుకొండ(నూజెండ్ల): వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ వీ 204 ఎలోని పట్టణంలో గల కేజీఎల్ కన్వెన్షన్‌లో గుడిపాటి రీజియన్ మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ కనమర్లపూడి హరిప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కొన్ని కోట్ల రూపాయల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ క్లబ్స్ సభ్యులకు పలు అవార్డులను అందజేశారు. రీజియన్ చైర్మన్ జీవీఎల్ నాగేశ్వరరావు, క్లబ్ సభ్యులు నాగమల్లేశ్వరరావు, గజవల్లి నాగపవన్‌కుమార్, సుబ్రహ్మణ్యం, సువర్ణలక్ష్మి, శ్రీనివాసరావు, శైలజ, కృష్ణారావు, చిలంకూరి కోటేశ్వరరావు, శారత, అరవింద్, అనిల్, రాము, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

73 శాతం పింఛన్ల పంపిణీ



నాదెండ్ల: మండలంలో వైఎస్సార్ పెన్షన్ కానుక – సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ ఆదివారం తొలిరోజు 73 శాతం పూర్తి చేశారు. మొత్తం 16 సచివాలయాల పరిధిలో 9741 మందికి గాను రూ.2,68,68,500లు పంపిణీ చేయాల్సి ఉంది. వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందిస్తుండటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నాదెండ్లలో నూతనంగా మంజూరైన పింఛనుదారులకు జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు పింఛను సొమ్ము పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ యల్లారావు, టీజే రత్తయ్య, నాగయ్య, చెంచురాజు, పట్టాభి, శివ ఉన్నారు. ఎంపీడీఓ షేక్ జాకీర్ హుస్సేన్, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు.

సీనియర్ ఓటర్లకు సన్మానం



రొంపిచర్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం 80 ఏళ్లు పైబడిన ఓటర్లను సత్కరించారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. గ్రామానికి చెందిన పల్లెల గోపిరెడ్డి, ఇస్తే గోవిందులను దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్వచ్ఛం.. సుందరం



వినుకొండలో రోడ్లు శుభ్రం చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



వంకాయలపాడు సంపదకేంద్రం వద్ద జంగిల్ క్లియరెన్స్ పనులు చేస్తున్న ఎంపీడీఓ వై.హనుమారెడ్డి, సర్పంచి నరసింహారావు

- గ్రామ గ్రామాన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాలు
- శ్రమదానం చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు

వినుకొండ(నూజెండ్ల): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని 32 వార్డుల్లో ఉదయం 10గంటల నుంచి గంట పాటు శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రత్యేక అధికారి కె.శ్రీరాములు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పట్టణం పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతిఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.వెంకయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్న కేశవులు, కౌన్సిలర్ షేక్ షకీలా, కౌన్సిలర్లు, మెప్మా సిబ్బంది, శానిటరీ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలోని లాయర్‌స్ట్రీట్‌లోని రోడ్లను బీజేపీ నాయకులు శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు.

వినుకొండ మండలంలో....

స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా వినుకొండ ఎంపీడీఓ మంగాపురనాథ్ మండలంలోని చీకటీగలపాలెం, అందుగులపాడు, నాగులవరం, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ ఆకుపచ్చ, ఎరుపు రంగు గల చెత్త డబ్బాలను పంపిణీ చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. జడ్పీటీసీ విజయలక్ష్మిరాజా, సర్పంచ్‌లు బొబ్బ విజయలక్ష్మి కోటిరెడ్డి, నూనె కోటేశ్వరరావు, చల్లా శ్రీరాములు, ఎంపీటీసీ సత్తార్ పుష్పారెడ్డి, ఈవోపీఆర్‌డీ సుందరరామిరెడ్డి, స్వచ్ఛభారత్ మిషన్ కో–ఆర్డినేటర్ ప్రభాకరరావు, చీరపురెడ్డి రామకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, బీఏకే జిలానీ, ఉదయ్‌కుమార్, శ్రీనుబాబు, మొహద్దీన్, గ్రామ సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో...

బొల్లాపల్లి: స్వచ్ఛత హీ సేవలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం శ్రమదానం నిర్వహించారు. ఆయా గ్రామ పంచాయతీల పరిసరాలను శుభ్రపరచారు. కనుమలచెరువు, మేళ్లవాగు, పేరూరుపాడు, రావులాపురం, మన్నేపల్లతండా తదితర పంచాయతీల్లో పంచాయతీ అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు శ్రమదానం చేసినట్లు ఈ మేరకు ఇన్‌చార్జి ఎంపీడీఓ షేక్ జిలానీబాషా తెలిపారు.

యడ్లపాడులో...

యడ్లపాడు: పల్లెల పరిశుభ్రత ప్రజల ఆరోగ్యానికి భద్రత అని ఎంపీడీఓ వై.హనుమారెడ్డి చెప్పారు. మండలంలోని వంకాయలపాడు గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద ఆదివారం కేంద్రం ప్రభుత్వం పిలుపు మేరకు స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. డంపింగ్‌యార్డు ప్రాంతంలోని పరిసరాలను అధికారులు, గ్రామస్తులు కలిపి గంటసేపు పరిశుభ్రం చేశారు. వంకాయలపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్ వడ్డేపల్లి నరసింహారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ బి.వరూధిని, ఏఓ బి.సాయిశ్రీనివాస్, ఎంఈఓ–1 నాగరత్నం, ఎంపీటీసీ సభ్యుడు బి.బొల్లయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో...

చిలకలూరిపేటటౌన్: ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. స్వచ్ఛత లీగ్ 2.0 లో భాగంగా ఏక్ తారీకికే ఏక్ గంట కార్యక్రమం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. రజకకాలనీలోని ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో జంగిల్ క్లియరెన్స్ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, డిపో మేనేజర్ ఎస్.రాంబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు, ఏడో వార్డు కౌన్సిలర్ చెవిటిగంటి పార్వతి, 9 వ వార్డు కౌన్సిలర్ చింతపల్లి విల్సన్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ షేక్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని కావూరు జెడ్పీ హైస్కూల్‌లో శ్రమదానం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కోడె సుధారాణి, సర్పంచ్ వై.లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు మంగమ్మ, ఎంఈఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శావల్యాపురం రైల్వే స్టేషన్‌లో...

శావల్యాపురం: స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక రైల్వే స్టేషనులో ఏక్ తారీకే, ఏక్ గంట కార్యక్రమం ఆదివారం రైల్వే అధికారులు సిబ్బంది నిర్వహించారు. ఈసందర్భంగా అసిస్టెంట్ డివిజనల్ సిగ్నల్ టెలికం ఇంజినీరు సయ్యద్ వజీర్‌బాబు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా బాధ్యత వహించాలన్నారు. అనంతరం రైల్వే స్టేషను పరిసరాల ప్రాంతాలను శుభ్రం చేశారు. రైల్వే స్టేషను సూపరింటెండెంట్ ఎ.మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

శావల్యాపురం: మండలంలోని వయ్యకల్లు, కారుమంచి గ్రామపంచాయతీలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు ఆదివారం ప్రజాప్రతినిధులు గ్రామసచివాలయ ఉద్యోగులు సంయుక్తంగా నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి చింతా శ్రీనివాసరావు తెలిపారు. సర్పంచ్ గోనుగుంట్ల వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు కావూరి మాబు సుభానయ్య, దారా మోషె, ఆరోగ్య కార్యకర్త నాగలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: మండలంలో అన్ని గ్రామాల్లో ఆదివారం స్వచ్ఛతే సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు ఒక గంట పాటు గ్రామాలలో స్వచ్ఛతే సేవ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా తొలుత స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేసి పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీ శివరామకృష్ణ, గ్రామ కార్యదర్శి ఎస్.నాగేశ్వరరావు, పడాల చక్రారెడ్డి, స్వచ్ఛ తే సేవ మండల కో–ఆర్డినేటర్ మేడికొండ సుబ్బారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



నాదెండ్లలో రోడ్లను శుభ్రం చేస్తున్న ఎంపీపీ రాణి, జెడ్పీటీసీ మస్తాన్‌రావు, సర్పంచ్ నాగలక్ష్మి

ఏఎం రెడ్డి ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో...

నరసరావుపేట రూరల్: ఏఎం రెడ్డి ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. రైల్వేస్టేషన్, మండలంలోని ఇస్సప్పాలెం గ్రామాల్లో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు సేవా కార్యక్రమాల్లో పాల్గొని శ్రమదానం చేశారు. రైల్వేస్టేషన్ ఆవరణలోని చెత్తను తొలగించారు. వ్యర్థాలను సేకరించి తరలించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.భార్గవ్‌భూషణ్ పాల్గొని మాట్లాడారు. సమాజంపై బాధ్యత కలిగిన పౌరులుగా విద్యార్థులు మెలగాలని తెలిపారు. విద్యతో పాటు సేవాభావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ లక్ష్మీసురేఖ, అధ్యాపకులు అజయ్‌కుమార్, సందీప్, డాక్టర్ అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: ప్రతి నెలా 1వ తేదీన ప్రతి ఒక్కరూ గంట పాటూ స్వచ్ఛత సేవ చేయాలని ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్లలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయం నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకూ నిర్వహించారు. విద్యార్థులతో కలిసి అధికారులు, నాయకులు ర్యాలీ నిర్వహించారు. రోడ్లను శుభ్రం చేశారు. గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి ఏపీని స్వచ్ఛాంధ్రప్రదేశ్ లక్ష్యంగా కృషి చేద్దామని ప్రతిజ్ఞ చేశారు. సర్పంచ్ మొగిలి నాగలక్ష్మి, ఎంపీడీఓ జాకీర్‌హుస్సేన్, ఎంఈఓ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి రాఘవయ్య, ఎస్సీ హాస్టల్ వార్డెన్ ఎం.సుబ్బారావు, ఎంపీటీసీలు గుడికందుల యల్లారావు, ఏసమ్మ, అంకమ్మ పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రజాసొమ్ము దోచుకోవటం నిజం

- ప్రాథమిక సాక్ష్యాలు ఉన్నందునే బాబుకు బెయిల్ రాలేదు
- సానుభూతికోసమే కంచాలు కొట్టడం లాంటి విన్యాసాలు
- విలేకరులతో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



నరసరావుపేట: రాష్ట్ర ప్రతిపక్ష నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్కిల్ డెవలప్మెంట్ వ్యవహారంలో చీకటి ఒప్పందం ద్వారా కోట్ల రూపాయలు దోచుకోవటం పచ్చి నిజమని, సాక్ష్యాలు బలంగా ఉండటం వలనే అతడికి కోర్టులు బెయిల్ ఇవ్వట్లేదని శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రూ.కోట్లు దోచుకొని జైలుపాలైన చంద్రబాబుకు టీడీపీ నాయకులు సానుభూతి కోసం కంచాలు కొట్టడం లాంటి నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. నిజంగా చంద్రబాబు తప్పు చేయకపోతే ఆయన వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేసిన పెండ్యాల శ్రీనివాసులు, గంటా సుబ్బారావు, మనోజ్‌లను ఎందుకు దేశం దాటించారని ప్రశ్నించారు. నేను తప్పు చేయను నిప్పులాంటి వాడినని ప్రచారం చేసుకున్న చంద్రబాబు ప్రజాసొమ్ము రూ.371కోట్లు ఏ విధంగా మళ్లించాడని ప్రశ్నించారు. సాక్ష్యాలు బలంగా ఉండటం వలనే కోర్టులు చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేయలేదని చెప్పారు. ప్రాథమిక సాక్ష్యాలతో సీఐడీ కేసు నమోదు చేసిందని, అందులో చంద్రబాబు, లోకేష్ నిందితులని పేర్కొన్నారు. అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్డు వ్యవహారంలో కూడా వీరిద్దరూ రూ.120కోట్లు దోచుకున్నారన్నారు. కేవలం చంద్రబాబుకు సానుభూతి కోసం టీడీపీ వర్గీయులు రకరకాలు విన్యాసాలు చేస్తున్నారని ఎమ్మెల్యే గోపిరెడ్డి పేర్కొన్నారు.

బాలుడి కుటుంబానికి రూ.2.60 లక్షల ఆర్థికసాయం

అందజేసిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు

నరసరావుపేట: పట్టణంలోని కోటసెంటర్ వంగవీటి రంగా విగ్రహం వద్ద ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందిన మిరియాల గణేష్(11) కుటుంబాన్ని శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఆ బాలుడి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా కాకుమానుబజార్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు రూ.2.60లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదేవిధంగా ఇంటి స్థలం కూడా కేటాయిస్తామని హామీ ఇచ్చారు. పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, మాజీ కౌన్సిలర్ చల్లా శివపార్వతి, వడ్డెర సంక్షేమ సంఘ జిల్లా సభ్యుడు వేముల శివ, వైఎస్సార్ సీపీ పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు అచ్చి శివకోటి, కాంట్రాక్టర్ బత్తుల చంద్రశేఖర్, కాకుమాను బజార్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వాసవీ స్కాలర్‌షిప్ సొసైటీ సేవలు భేష్

నర్సరావుపేట: గత 25ఏళ్లుగా వాసవీ స్కాలర్‌షిప్ సొసైటీ సమాజానికి చేస్తున్న సేవలు అభినందించతగినవని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివారెడ్డి పేర్కొన్నారు. స్థానిక పాతూరులోని కుసుమ హరినాథ్‌బాబా మందిరంలో ఆదివారం స్కాలర్‌షిప్ సొసైటీ ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథులుగా శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి, డీఎస్పీ కేవీ మహేష్ హాజరయ్యారు. గోపిరెడ్డి మాట్లాడుతూ జిల్లా వాసవి సొసైటీని స్థాపించి సమాజ సేవ చేస్తున్న వ్యవస్థాపకుడు చీతిరాల గురు పెద్దన్నను అభినందించారు. అనంతరం సొసైటీ రూపొందించిన 5000 క్లాత్ బ్యాగ్స్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా వాసవి స్కాలర్షిప్ సొసైటీ కమిటీ సభ్యులకు సన్మానం చేశారు. అదేవిధంగా పట్టాభి రామస్వామి దేవస్థానంలోని వేంకటేశ్వర కళ్యాణ మండపంలో మెడికల్ అసోసియేషన్ 25వ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానాన్ని ప్రారంభించారు. పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు కాకుమాను సదాశివరెడ్డి, నిడమానూరి సురేంద్ర, బత్తుల విష్ణు, సయ్యద్ ఖాదర్‌బాష, విద్యుత్‌శాఖ డెప్యూటీ ఇంజినీర్ వై.ఏడుకొండలు, ఆర్యవైశ్య నాయకులు చేగు వెంకటేశ్వరరావు, ప్రవల్లికా సత్యం, స్కాలర్‌షిప్ సొసైటీ ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.



సొసైటీ క్లాత్ బ్యాగులను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, డీఎస్పీ మహేష్, ప్రతినిధులు

3,4 తేదీల్లో వేల్పూరులో సురక్ష వైద్యశిబిరాలు

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామపంచాయతీ పరిధిలో రెండు గ్రామ సచివాలయాల పరిధిలో ఈనెల 3,4వ తేదీల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు జరుగుతాయని ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ వేల్పూరు గ్రామ పంచాయతీ పరిధిలో గంటావారిపాలెం, వెలమవారిపాలెం, శివారు గ్రామాలు ఉండగా 43 మంది వలంటీర్లు ఉన్నారని మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారులు ఇరువురు పర్యవేక్షణలో ఆరోగ్య కార్యకర్త, ఎంఎల్‌హెచ్‌పీ రెండు టీంలను ఏర్పాటు చేసి ఇంటింటి సర్వేతో పాటు వైద్య ఆరోగ్య సిబ్బంది హిమోగ్లోబిన్, బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. 90 శాతం సర్వే పూర్తి అయిందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంపై కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు ఎస్.అమరలింగేశ్వరి, ఎం.విజయమ్మ, ఎంఎల్‌హెచ్‌పి మేరికుమారి, శ్యామలత పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఆరోగ్య కార్యకర్తలు

ములకలూరులో ఆయుష్ వైద్యశిబిరం

వినుకొండ(నూజెండ్ల): ప్రపంచ వృద్ధుల దినోత్సవం, ఆయుష్మాన్‌భవ కార్యక్రమంలో భాగంగా నూజెండ్ల మండలంలోని ములకలూరు గ్రామంలో ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస్ వైద్యశిబిరం, వయో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. అనంతరం యోగా శిబిరం నిర్వహించారు. వృద్ధులు ప్రతి రోజూ మజ్జిగ, ఆకుకూరలు, కూరగాయలు, తృణధాన్యాలు సరిపడా తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. సర్పంచ్ కంచర్ల కోటేశ్వరమ్మ బాబు, యోగా టీచర్ వెంకటాచారి, స్వచ్ఛభారత్ మండల కన్వీనర్ సుబ్బరామయ్య, సీహెచ్‌ఓ పఠాన్ మాబు సుభాని, ఏఎన్‌ఎం మహాలక్ష్మి, శ్రీను, ఆశ కార్యకర్త మరియమ్మ, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీనివాస్

ఖోఖో జిల్లా జట్టుకు ఎంపికైన గుడ్‌షెపర్డ్ విద్యార్థులు

వినుకొండ(నూజెండ్ల): నరసరావుపేటలోని శంకర భారతి పురం ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన ఉమ్మడి గుంటూరు జిల్లా ఖోఖో జూనియర్స్ బాలబాలికల జట్ల ఎంపిక పోటీల్లో పట్టణంలోని గుడ్‌షెపర్డ్ స్కూల్‌కు చెందిన డి.తేజ, యు.మహేష్‌లు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ డాక్టర్ జి.ఇన్నారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. వీరు ఈ నెల 20 నుంచి 22 వరకు చిత్తూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ప్రిన్సిపాల్ జి.సునీత, మదన్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి, వ్యాయమ ఉపాధ్యాయులు అజీమ్, వెంకటేష్, వెంకట్, నాగరాజు, ఉపాధ్యాయులు ఎంపికై న విద్యార్థులను అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో కోచ్

మాతాశ్రీ హాస్పిటల్‌లో లైవ్‌లేజర్ ప్రాక్టాలజీ వర్క్‌షాపు

- వివిధ ప్రదేశాల నుంచి 15మంది వైద్యులు హాజరు
- పదిమంది రోగులకు ఉచితంగా లేజర్ ఆపరేషన్లు

నరసరావుపేట: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల మాతాశ్రీ హాస్పిటల్‌లో ఆదివారం లైవ్ లేజర్ ప్రాక్టాలజీ వర్క్‌షాపు నిర్వహించినట్లు హాస్పిటల్ అధినేత డాక్టర్ పి.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. వీరి ద్వారా పదిమంది రోగులకు ఉచితంగా వేర్వేరు లేజర్ ఆపరేషన్లు నిర్వహించామన్నారు. వర్క్‌షాపులో కాకినాడకు చెందిన డాక్టర్ గొడవర్తి రామ్మోహన్, రావులపాలెంకు చెందిన డాక్టర్ ఎంఆర్‌ఎల్ భీమారెడ్డి, హైదరాబాదుకు చెందిన డాక్టర్ నల్లి అభిలాష్, స్థానిక చెరుకూరి హాస్పిటల్ డాక్టర్ ఫణికుమార్, గుంటూరుకు చెందిన డాక్టర్ సురేంద్ర తదితర ఆపరేటింగ్ ఫ్యాకల్టీ డాక్టర్లు హాజరయ్యారన్నారు. లేజర్ ఆపరేషన్లు నేర్చుకుందామనుకునే యువ డాక్టర్లు మరికొంతమంది హాజరయ్యారన్నారు.



వర్క్‌షాపులో పాల్గొన్న డాక్టర్లు

ఎంఎస్ స్వామినాథన్ మృతికి నివాళులు

రొంపిచర్ల : స్థానిక చెరువుకట్ట సెంటర్లో ఆదివారం భగత్ సింగ్ భవన నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల మృతి చెందిన వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్‌కు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంఎస్ స్వామినాథన్ వ్యవసాయ పురోభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. భగత్ సింగ్ భవన నిర్వహణ కమిటీ సభ్యులు సరికొండ రామకృష్ణంరాజు, శేషంరాజు, ఎం. శ్రీనివాసరెడ్డి, మస్తాన్ వలి, ఆర్. సాంబయ్య, సుబ్బరాజు, సరికొండ తిమ్మరాజు, రైతులు పాల్గొన్నారు.

170 మందికి కంటి పరీక్షలు

నాదెండ్ల: సాతులూరులోని ఓ ప్రైవేటు పాఠశాలలో అమెరికాకు చెందిన రూరల్ హోప్ ఫౌండేషన్ సహకారంతో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెదకాకాని శంకర కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 170 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందించారు. వీరిలో 110 మందికి శుక్లాలు ఉన్నట్లు గుర్తించి ఆపరేషన్‌కు రిఫర్ చేశారు. వీరికి త్వరలో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి శంకర కంటివైద్యశాలలో ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అక్రమ మద్యం కేసులో నిందితుడు అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమ మద్యం కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 5 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్‌ఐ సురేంద్రబాబు ఆదివారం తెలిపారు. అందిన సమాచారం మేరకు చిత్రాలయ టాకీస్ వద్ద తనిఖీలు నిర్వహించి అక్రమంగా మద్యం కలిగిన కేసానుపల్లి గ్రామానికి చెందిన రావిపాటి వెంకటేశ్వర్లును అరెస్ట్ చేశామన్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆరు ద్విచక్ర వాహనాలు చోరీ

నరసరావుపేట టౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల అపహరణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ వీరేంద్రబాబు ఆదివారం తెలిపారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో 6 ద్విచక్ర వాహనాలు గడిచిన వారం రోజుల వ్యవధిలో అపహరణకు గురైనట్లు తెలిపారు. యజమానులు వాహనాల కోసం గాలించినా ఎటువంటి ప్రయోజనం లేకపోవటంతో ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

48 మద్యం బాటిళ్లు స్వాధీనం

అమరావతి: స్థానిక బస్టాండు సెంటర్‌లో పెదకూరపాడు స్పెషల్ ఎన్‌పోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు ఇద్దరు నుంచి అక్రమంగా తరలిస్తున్న 48 మద్యం బాటిళ్లను ఆదివారం మధ్యాహ్నం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఈబీ ఎస్‌ఐ ఫణికుమార్ మాట్లాడుతూ అమరావతికి చెందిన తమ్మిశెట్టి శంకర్, మండల పరిధిలోని ధరణికోటకు చెందిన యెడ్లూరి ఏసోబు అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు సమాచారం మేరకు తనిఖీ చేసినట్లు చెప్పారు. వీరి నుంచి 48 క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. అదుపులోకి తీసుకున్న తమ్మిశెట్టి శంకర్, యెడ్లూరి ఏసోబులపైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.